క్లుప్తంగా

జల్‌జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు



తోటాడలో జల్‌జీవన్ మిషన్ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా తోటాడలో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు పనులు గురువారం ప్రారంభించారు. ప్రతి ఇంటికీ పరిశుద్ధమైన నీటిని కుళాయిల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరావు, బుద్ద రమేష్‌నాయుడు, దొడ్డి రమేష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు నగదు, పుస్తకాలు అందజేత



హెచ్‌ఎం దుర్గాప్రసాద్‌కు నగదు, పుస్తకాలు అందజేస్తున్న రమణ

మునగపాక : మునగపాక దళితవాడలోని ప్రాథమిక పాఠశాల–2కు స్థానిక శాఖా గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ గురువారం రూ.వెయ్యి నగదుతో పాటు పలు పుస్తకాలను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి రమణ అందించిన సహకారం అభినందనీయమని హెచ్‌ఎం శివకోటి దుర్గాప్రసాద్ అన్నారు.

అందుబాటులో వర్మీ కంపోస్టు



వర్మీని పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : రైతులకు లాభదాయకంగా ఉండే వర్మీని అందజేస్తున్నామని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. నేల సారవంతంగా ఉండేందుకు వర్మీ ఎంతగానో దోహదపడుతుందన్నారు. మునగపాక సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టును బస్తాలుగా అందుబాటులోకి తీసుకువచ్చారు. 25 కిలోల బస్తాను రూ.250 చొప్పున విక్రయిస్తున్నామన్నారు. ఆసక్తి కల రైతులు పంచాయతీ అధికారులను సంప్రదించాలని అప్పారావు తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మునగపాక : మండలంలోని రామగిరిలో 121 పోలింగ్ బూత్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల పనితీరుపై అధికారులు గురువారం అవగాహన కల్పించారు. ఆర్‌ఐ పి.కిషోర్‌కుమార్, రీసర్వే డీటీ పడాల్ ఓటు వేసే విధానంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఏఎస్‌ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు లింగరాజుపాలెంలో జగనన్న సురక్ష

ఎస్.రాయవరం : లింగరాజుపాలెంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 నిర్వహిస్తున్నట్టు సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ తెలిపారు. ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉంటారని, అవసరమైన వారు వైద్య సేవలు వినియోగించుకోవాలన్నారు. గత శిబిరంలో వైద్య పరీక్షలు చేసిన వారిని కూడా పరిశీలించి అవసరమైతే మెరుగైన వైద్యం కోసం పట్టణ ఆస్పత్రులకు తరలించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పది విద్యార్థులు బాగా చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అధికారులు స్పష్టం చేశారు. రాంబిల్లి, ఎస్.రాయవరం, మునగపాక తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నైపుణ్యాలను స్వయంగా పరిశీలించి పలు సలహాలు, సూచనలు అందజేశారు.

- పది విద్యార్థులకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దిశా నిర్దేశం చేయాలి
- డిప్యూటీ డీఈవో అప్పారావు



దిమిలిలో జగనన్న గోరుముద్ద, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు



దిమిలి ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

రాంబిల్లి : పదో తరగతి విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈవో పి. అప్పారావు అన్నారు. దిమిలి ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. పదో తరగతి విద్యార్థుల ప్రావీణ్యం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆరో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం, మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలిసి రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. 6 నుంచి 9 తరగతులకు సంబంధించి సకాలంలో సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి. ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో..

మునగపాక : పదవ తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శ్రీనివాసరావు కోరారు. తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పిల్లల చదువుపై దృష్టి సారించాలన్నారు. విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు వెళ్లి తల్లితండ్రులతో మాట్లాడారు. ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలని తద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. పిల్లలు పరీక్షలు అయ్యేంతవరకు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండేలా చూడాలని, అలాగే ఏకాగ్రతతో చదువుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పీఎంసీ చైర్మన్ ఆడారి సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగులాపల్లి హైస్కూల్ సందర్శన..

మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డీఈవో వెంకటలక్ష్మి గురువారం సందర్శించారు. ఉపాధ్యాయులకు సంబంధించిన రికార్డులతో పాటు లీప్ రికార్డులు పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అలాగే పదిలో శతశాతం ఫలితాలు వచ్చేలా కష్టపడాలన్నారు. రాత్రి వేళల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లితండ్రులకు అవగాహన కల్పించాలన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు..

ఎస్.రాయవరం: గత నెల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులకు నిర్వహించిన మోడల్ టెస్ట్‌లో విజేతలైన వారికి గురువారం కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పలు మోడల్ టెస్ట్‌లు రాయడం వల్ల పరీక్ష భయం తగ్గుతుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి ఎం. రమణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



మునగపాకలో విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు



కొరుప్రోలు ఉన్నత పాఠశాల విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

పాయకరావుపేట : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల డ్రైవర్లకు పాయకరావుపేట సీఐ అప్పలరాజు అవగాహన కల్పించారు. సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, నియమాల ప్రకారం డ్రైవింగ్ చేయాలని, పార్కింగ్ చేసేటప్పుడు, మలుపుల్లో జాగ్రత్తలు పాటించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎంటీ మేనేజర్ కె.సత్యనారాయణ, టోల్ మేనేజర్ డీపీ కృష్ణ, సేఫ్టీ మేనేజర్ అశోక్‌కుమార్, శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానంతరం భద్రతా ప్రమాణాలపై చర్చలో ఉత్సాహంగా పాల్గొన్న డ్రైవర్లకు బహుమతులు అందజేశారు.



డ్రైవర్లకు బహుమతులు అందజేస్తున్న సీఐ అప్పలరాజు

నేటి నుంచి 7 గంటల విద్యుత్

మునగపాక : మునగపాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వ్యవసాయ రంగానికి శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ ఉంటుందని అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు.

రైల్వే ట్రాక్ సమీపంలోని చెరువుల పరిశీలన

ఎస్.రాయవరం : మండలంలోని సర్విపట్నం రోడ్డు సమీపంలో రైల్వే ట్రాక్‌కి ప్రమాదం కల్పించే చెరువులను నీటి పారుదలశాఖ, రైల్వే అధికారులు గురువారం పరిశీలించారు. చినగుమ్ములూరు, పెట్టుగోళ్లపల్లి, రామయ్యపట్నం గ్రామాల సమీపంలో రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న చెరువుల వల్ల వరదల సమయంలో ట్రాక్ పైకి నీరు వచ్చే సమస్య ఉందన్నారు. ఆ చెరువు గట్లను పటిష్టం చేయాలన్నారు. ఈమేరకు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి చర్యలు చేపడతామని చెప్పారు. ఈ పరిశీలనలో నీటి పారుదల శాఖ డీఈ ఎస్. జగదీశ్వరరావు, ఏఈ చిన్నారావు, రైల్వేశాఖ ఏడీఎన్ సతీష్ ఉన్నారు.



రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న చెరువులను పరిశీలిస్తున్న అధికారులు

దాతృత్వం చాటుకున్న విద్యార్థులు



సేకరించిన నిధిని సంస్థ ప్రతినిధికి అందజేస్తున్న విద్యార్థులు

కోటవురట్ల : విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవరచుకోవాలని హెచ్‌ఎం బుజ్జిబాబు అన్నారు. లింగాపురం ఎంపీపీ స్కూల్ విద్యార్థులు ఓ అనాథ శరణాలయానికి చేయూతనిచ్చేందుకు గ్రామంలో తిరిగి నిధిని సేకరించి దాతృత్వం చాటుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం, పాల్వంచలో ఉన్న యువసేన అనాథ శరణాలయానికి గురువారం నిధి సేకరించి సంస్థ ప్రతినిధికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జవ్వాది రాజశేఖర్, లోవరాజు పాల్గొన్నారు.

వివాదాస్పదమవుతున్న లారీ డ్రైవర్ల తీరు

మునగపాక : పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకలపై ఇప్పటికే ఆందోళనలు వ్యక్తమవుతుంటే ఇదేమీ పట్టనట్లు లారీ డ్రైవర్లు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. గురువారం అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వైపునకు వెళ్తున్న లారీ వెనుక డోర్ వేలాడుతుండడాన్ని మునగపాక ఉప సర్పంచ్ బొడ్డేడ అప్పలనాయుడు గమనించి డ్రైవర్‌ను హెచ్చరించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరించడం తగదని, పోలీసులు స్పందించి భారీ వాహనాల రాకపోకలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



వేలాడుతున్న లారీ వెనుక డోర్ చూపిస్తున్న మునగపాక ఉప సర్పంచ్ అప్పలనాయుడు

జనసేన కార్యకర్తలు డీలా

రాంబిల్లి : వెంకటాపురం జంక్షన్ వద్ద గల జనసేన పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం రాత్రి నిర్వహించిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ నేత నాగేంద్రబాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ యలమంచిలిలో 15 ఏళ్లుగా రైల్వే పైవంతెన నిర్మించలేకపోయారని విమర్శించారు. జనసేన తరపున నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్‌కు సీటు ఇవ్వాలని నాయకులు, కార్యకర్తలు కోరగా పొత్తు పేరు చెప్పి ఏం జరుగుతుందో చెప్పలేమని పేర్కొనడంపై కార్యకర్తలు డీలా పడ్డారు. ఈ ఆత్మీయ సమావేశంలో జనసేన ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్, రూరల్ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, యలమంచిలి ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకుడు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని మండీ డాబా సమీపంలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. యలమంచిలి మండలం కొత్తలి గ్రామానికి చెందిన ఇల్లా మణికంట మరో యువకుడు ద్విచక్రవాహనంపై యలమంచిలి నుంచి వెళ్తుండగా అచ్యుతాపురం బైపాస్ రోడ్డు కూడలి వద్ద ఐషర్ వ్యాన్ ఢీకొట్టింది. వ్యాను మణికంట కుడికాలిపై నుంచి వెళ్లడంతో కొంత భాగం పూర్తిగా నుజ్జయింది. 108 వాహనంలో యలమంచిలి సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స తర్వాత మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పట్టణ పోలీసులు ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న జిల్లాస్థాయి గుర్రప్పందాలు

బుచ్చెయ్యపేట: మంగళాపురంలో జిల్లా స్థాయి గుర్రప్పందాలు, ఎడ్లబళ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఇక్కడ ఆంజనేయస్వామి తీర్థం సందర్భంగా గురువారం నిర్వహించిన ఈ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గుర్రం పందెంలో మొదటి ఐదు బహుమతులను కుమార్(దేవరపల్లి), సాయితేజ(వడ్డాది), మోదమాంబ(గవరపాలెం) రమేష్(భోగాపురం), సాయి(దేవరాపల్లి) దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు బహుమతులు ప్రదానం చేశారు.



నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు

ఘనంగా నెహ్రూ తీర్థం

మాడుగుల రూరల్: కె.జె.పురంలో మాజీ ప్రధాని దివంగత పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. మదర్‌థెరిసా టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో కాలిపేట వీధిలో నెహ్రూ విగ్రహానికి సర్పంచ్ జామి రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు బీశెట్టి శ్రీనివాసరావు నివాళులర్పించారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు

కె.కోటపాడు: గర్భిణులకు ప్రభుత్వాస్పత్రుల్లోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి శైలజ తెలిపారు. గురువారం లంకవానిపాలెం పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది గర్భిణులను ఆమె పరీక్షించి ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ప్రతి నెలా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యాత్ర–2 చిత్రం తిలకించిన నాయకులు

పాయకరావుపేట: దివంగత నేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి పాలన, ఆయనపై ప్రజల ఆదరణను ప్రధాన అంశంగా తెరకెక్కించిన యాత్ర–2 చిత్రాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తిలకించారు. అనంతరం నాయకులు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జై అంటూ నినాదాలు చేశారు. పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు మాట్లాడుతూ యాత్ర –2 చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. చిత్రం తిలకించిన వారిలో ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్‌ఖన్నా, నాయకులు గెడ్డమూరి శ్రీను, పల్లేల లక్ష్మణరావు, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పల్లేల వెంకట్, దోమాడ సుందరరావు, పిరాధి రాజు, కొప్పిశెట్టి మోహన్, బోడపాటి గోవింద, నెలపర్తి నాగరాజు తదితరులు ఉన్నారు.



సీఎం జగన్‌కి జై అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు

కేక్ కటింగ్..

అచ్యుతాపురం : ఎస్‌టీబీఎల్ థియేటర్‌లో గురువారం ప్రదర్శించిన యాత్ర–2 చిత్రానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సినిమా విజయాన్ని ఆస్వాదిస్తూ పలువురు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన ర్యాలీ



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

రాంబిల్లి : నులి పురుగులు ఆరోగ్యానికి హానికరమని దిమిలి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఎస్ఎస్‌వీఎన్ రాజు, హెల్త్ సూపర్‌వైజర్ సీహెచ్ ధనరాజు తెలిపారు. ఈ నెల 9 న నిర్వహించే నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ నిర్వహించారు. తొలుత దీనికి సంబంధించిన గోడపత్రికను సర్పంచ్ బంగారు చిలుకు ఆవిష్కరించారు. కుష్ఠు వ్యాధిపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జి. ప్రసాదరావు, పీఈటీ రామకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్ రాజు, ఏఎన్‌ఎంలు చినమ్మలు, రాజ్యలక్ష్మి, మల్లీశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



గోడ పత్రిక విడుదల చేస్తున్న ఎంపీడీవో స్వప్న

గోడపత్రిక ఆవిష్కరణ..

పాయకరావుపేట : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9న అన్ని పాఠశాలల్లోను విద్యార్థులకు అల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ వైద్యులు డి.సుభాష్ తెలిపారు. ఒకటి నుండి 19 సంవత్సరాల వయస్సు గల బాల బాలికలందరికీ నులిపురుగు నిర్మూలన మాత్రలు అందిస్తామన్నారు. కార్యక్రమం ప్రచార పత్రికను ఎంపీడీవో కె.స్వప్న స్థానిక పీహెచ్‌సీలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సౌందర్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డులు కంప్యూటరీకరించాలి

పాయకరావుపేట : సహకార సంఘాల్లో ఉన్న రికార్డులను సత్వరమే కంప్యూటరీకరించాలని పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్‌ఖన్నా సిబ్బందిని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంఘంలో రికార్డులను కంప్యూటరైజేషన్ చేసే అంశంపై దృష్టి సారించాలన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులు కూడా ఆయా సంఘాల సీఈవోలతో సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. పాయకరావుపేట పీఏసీఎస్‌లో గురువారం జరిగిన ఈ సమావేశంలో సీఈవో పి.నాగభూషణం రికార్డుల కంప్యూటరీకరణపై సిబ్బందికి అవగాహన కల్పించారు.



పీఏసీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్‌ఖన్నా

దేశీయ గోజాతుల పెంపకం మేలు

కోటవురట్ల: పాడి రైతులు దేశీయ గోజాతుల పెంపకం చేపట్టాలని జిల్లా పశుగణాభివృద్ధి సంఘం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బి.రామ్మోహనరావు కోరారు. కొడవటిపూడిలో గురువారం లేగదూడల ప్రదర్శన నిర్వహించి ఉత్తమ లేగదూడల రైతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రామ్మోహనరావు, ఎఫ్ఎస్‌బీఎస్ డీడీ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ ప్రారంభించగా రైతులు ఉత్సాహంగా లేగదూడలతో పోటీలో పాల్గొన్నారు. డీఎల్‌డీఏ ఈవో డాక్టర్ రామ్మోహనరావు మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ పాడి రైతులకు అండగా ఉందన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పిండ బదిలీ సాంకేతికతను ఉపయోగించి మంచి ఫలితాలను పొందవచ్చన్నారు. ఈ పోటీలో 60 మంది రైతులు పాల్గొనగా మేలు జాతి పెయ్యలు, జెర్సీ, హెచ్‌ఎఫ్, ముర్రా, దేశీయ గోజాతి దూడలను ప్రదర్శించారు. లేగదూడల జాతి లక్షణాలు, రైతుల పోషణను ఆదారంగా తీసుకుని మేలుజాతి దూడలను ఎంపిక చేశారు. బగుడు రమణ దూడ ప్రథమ, కర్రి నూకినాయుడు దూడ ద్వితీయ, బగుడు సతీష్ దూడ తృతీయ స్థానంలో నిలిచాయి. సర్పంచ్ కోసూరు అప్పారావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ సింహాద్రప్పడు, పశు వైద్యాధికారులు, కె.బాబూరావు పడాల్, పెట్ల నరేష్, ఆర్.ప్రతాప్, పి.హరిప్రియ, పశు వైద్య సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.



లేగదూడలను పరిశీలిస్తున్న అధికారులు

సాధన సంకల్ప సభను విజయవంతం చేయాలి

పాయకరావుపేట: ఈ నెల 10 తేదీన పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగే దళితవాడ పంచాయతీ సాధన సంకల్ప సభను జయప్రదం చేయాలని స్థానిక దళిత నాయకులు విలేకరుల సమావేశంలో తెలిపారు. అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, డీఐజీ, పీవీ సునీల్‌కుమార్ ముఖ్య అతిథిగా సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాటి మేఘరంజన్, ఎయిమ్ రాష్ట్ర నాయకులు కె.దిలీప్, జె.చినబాబు, స్థానిక దళిత నాయకులు నెలపర్తి అర్జున్, పల్లా విలియంకేరి, ఇంజరపు సూరిబాబు, ఐఎన్ మూర్తి, ముక్కుడుపల్లి నాగరాజు, గుళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దళిత నాయకులు

కార్యాలయాల పనితీరుపై అవగాహన

మాకవరపాలెం: ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి పాఠ్యాంశం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలోని నాలుగు నుంచి ఏడో తరగతి విద్యార్థులతో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా మాకవరపాలెంలో ఎంఈవో, ఎంపీడీవో, తహసీల్దార్, వెలుగు, విద్యుత్ శాఖ కార్యాలయాలతో పాటు పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లి వాటి పనితీరును ఎంఈవో మూర్తి, హెచ్‌ఎం కె.రాము వివరించారు.



ఎమ్మార్సీ కార్యాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న ఎంఈవో మూర్తి

చెత్త బుట్టల పంపిణీ

చీడికాడ: పంచాయతీ ఇచ్చిన బుట్టల్లోనే తడి, పొడి చెత్త వేయాలని సర్పంచ్ వంటాకు నర్సింహమూర్తి తెలిపారు. వీరభద్రపేటలో గురువారం ఆయన గ్రామస్తులకు తడి చెత్త, పొడి చెత్త వేసేందుకు రెండు బుట్టల చొప్పున 600 బుట్టలు పంపిణీ చేశారు. ఈ బుట్టల్లో వేసిన చెత్తను స్వీపర్లు రోజూ ఇంటింటికీ వచ్చి తరలిస్తారన్నారు. రోడ్ల పక్కన, మురుగు కాలువల్లో చెత్త వేయొద్దని సూచించారు.